# అతని జవాబు

తను మళ్ళీ పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నానని సుందర్ చెప్పాడు. భయపడు తూనే చెప్పాను మా పెదనాన్నగారి అమ్మాయి విజయ ఉందని. విజయకి వయసు పాతిక దాటింది. బి.ఎ. పాసై టీచర్‌గా ఉద్యోగం చేస్తోంది. ఇప్పుడు ప్రైవేట్‌గా ఎమ్మెకీ కడుతోందిట. పొడుగు జడతో చామనచాయ రంగైనా అందంగానే ఉంటుంది. అసలు వయసే ఒక ఆకర్షణ అమ్మాయిలకి. విజయకి చదువు, అందం ఉన్నాయి. ఇతడికి రెండవ పెళ్ళి. భార్య జబ్బుచేసి పోయింది. ఒక కొడుకు ఉన్నాడు. కనక కట్నాల బాధ ఉండదు.

మరి భయం ఎందుకంటే?

రెండేళ్ళ క్రిందట మురళీమోహన్ నాకు స్నేహితుడు.

చక్కని మాటకారి, కలుపుగోరు స్వభావం, కథల్నీ, మనుషుల్నీ విమర్శిస్తుండే వాళ్ళం. అతడికి ఉద్యోగం ఉంది. ఇంక పెళ్ళి కావాలి.

చదువు, మామూలు అందం ఉండాలి. అన్నిటికీ తల ఊపే గంగిరెద్దూ వద్దు. ఫ్యాషన్లకీ, నవనాగరికతకి పోయి ఇంటినీ మొగుణ్ణి నిర్లక్ష్యం చేసే ధూర్తురాలూ వద్దు. ఆలోచనలో సమన్వయం ఉండి, మొగుడిని పిల్లల్ని సంతోషపెడుతూ తనూ సుఖంగా ఉండాలనుకునే మామూలు అమ్మాయి చాలు నాకు. కట్నాల అవసరం లేదు అన్నాడు.

నాకు చాలా సంతోషం వేసింది.

విజయ మనసులో ఉంది.

ఇద్దరికీ ఈడూ జోడూ బాగుంటుంది. ఈ సంబంధం కుదిరితే విజయ అదృష్టవంతురాలే, మోహన్ కూడానూ! సంసారం సుఖవంతంగా నడిపించగల భార్య దొరకటం అదృష్టం కాదూ మరి! విజయ సమర్థురాలైన మంచి పిల్ల. వెంటనే విజయ సంగతి మోహన్‌కి చెప్పాను.

పెదనాన్నకి మోహన్ సంగతి చెప్పాను. పెళ్ళిచూపులు నిశ్చయం చేసి మోహన్ని వాళ్ళింటికి తీసికెళ్ళాను.

పేరుకి పెళ్ళిచూపులుగానీ ఒక స్నేహితుడు ఇంటికి వస్తే జరిగినట్లు జరిగిపోయింది అంతా. పెదనాన్న ఫామిలీ, మేమిద్దరం డ్రాయింగ్ రూమ్‌లో కూర్చున్నాం. ఫలహారం తిని కాఫీ తాగుతూ కబుర్లు చెప్పుకున్నాం. విజయకీ ఇద్దరు అక్కయ్యలు, ఒక చెల్లెలు, ఇద్దరు తమ్ముళ్ళు. అందరినీ పరిచయం చేశాను. అప్పుడు వినత ఇంట్లో లేదు. ఒక గంట గడిపి లేచి వచ్చేస్తుంటే వినత వచ్చింది, వినత కొడుకు నామీదకి దూకాడు 'మామా' అంటూ.

వాణ్ని ముద్దుపెట్టుకుని వదిలించుకుని వచ్చేశాను.

''పాపం వాడు పుట్టడానికి ముందరే తండ్రిపోయాడు. యాక్సిడెంట్‌లో'' అన్నాను మోహన్ మొహంలో ఆశ్చర్యం అదిరిపాటు కనిపించాయి.

''అంటే వినత విడో!'' అన్నాడు.

''ఔను.'' అన్నాను పరిశీలనగా చూస్తూ.

''వాళ్ళ పెద్దక్క కూడా విడో'' కదూ.

ఔను విమలకి ముగ్గురు పిల్లలు పుట్టాక పదేళ్ళు కాపురం చేసాక అతడు జబ్బుచేసిపోయాడు. స్కూల్లో టీచర్ పనిచేస్తూ పుట్టింట్లోనే ఉంది.

''ఔను చెప్పాను కదా'' అన్నాను.

మోహన్ మొహం పాలిపోయింది. విజయని చూసినప్పుడు అతడు కళ్ళలోకి వచ్చిన కాంతి, మాట్లాడినంతసేపూ ఉన్న సరదా, క్షణంలో మాయమయ్యాయి.

ఐతే మోహన్‌కూడా భయపడుతున్నాడన్నమాట.

ఇదివరకు మాకు ఇది రెండుసార్లు అనుభవంలోకి వచ్చింది. విజయకి రెండు సంబంధాలు చూశాము ఇదివరలో. పై వాళ్ళిద్దరూ విడోలని, ఈ పిల్లని చేసుకోటానికి సంశయం ప్రకటించారు ఇద్దరూ. విరమించుకున్నారు. చాదస్తం కాకపోతే భయమేమిటి? చావకుండా బ్రతికిన వాడెవడేనా ఉన్నాడా? ఎవరి అదృష్టం వాళ్ళది. ఎవరి జీవితరేఖవారిది! విధివశాత్తు ఆ ఇద్దరికీ అట్లాగ జరిగింది.

అందరికీ అట్లాగే జరుగుతుందనుకోవటం తప్పు కాదూ! మూర్ఖత్వం కాదూ! ఎవరో ఒకడు చదువుకున్నవాడూ, సంస్కార వంతుడూ రాకపోడు అనుకున్నాం. కానీ మళ్ళీ ఎవరూ విజయని చూసుకోటానికి రాలేదు.

ఆనోటా ఈనోటా ఈఅమ్మాయిని చేసుకున్నవాడి గతేమిటో అన్నమాట వినిపించింది. విజయ కూడా వింది. ''నన్ను చేసుకుని ఎవడూ చావక్కర్లేదు. ''నేనసలు పెళ్ళి చేసుకోను'' అంది.

ఉద్యోగంలో చేరింది. ఇప్పుడు ప్రైవేటుగా ఎమ్.ఎ.కి కూడా చదువుతోంది.

పెళ్ళి అంటే విముఖత విరక్తి మాత్రమే కాదు. తీవ్రంగా నిరసిస్తోంది.

''ఇద్దరూ ఒకరి నొకరు ఇష్టపడి కలిసి బ్రతకటానికి సిద్ధపడాల్సిన విషయం.

ఎవరో మధ్యవాళ్ళు బేరాలాడి కట్నం కుదర్చటం, జాతకాలంటూ అబద్ధాలని నమ్మటం.... అనవసరమైన తతంగమంతా జరిపి వృధా ఖర్చు చెయ్యటం'' అంటూ మన పద్ధతుల్ని దుమ్మెత్తి పోసింది.

''పెళ్ళి ఒక స్త్రీ పురుషుల వ్యక్తిగత సమస్య అనుకోవటం పొరపాటు విజ్జీ. సాంఘిక వ్యవస్థలో మనిషి ఒక భాగం. పెళ్ళి సంఘం ఇచ్చే లైసెన్సులాంటిది. కుటుంబ జీవనం సాగించటానికి సంతానం, ఆరోగ్యం, ఆస్తిపాస్తులు ఆ పెళ్ళిమీద ఆధారపడి ఉంటాయి. పెళ్ళి ద్వారా వంశాభివృద్ధి జరగాలి. కేవలం ఒక స్త్రీ పట్ల తనకున్న ఆకర్షణ, ఆరాధన తీర్చుకుంటే చాలదు. పెళ్ళి వ్యక్తిగతమైన సమస్యకాదు, సాంఘిక బాధ్యత కుటుంబ సమస్య!''

''జీవితానందం చుట్టూ ముళ్ళకంచె దాన్ని లాగి పారెయ్యాలి''

''మనకి అన్యాయం జరిగినప్పుడు బాధగా ఉంటుంది కానీ కొన్ని నియమాలకి లోబడకుండా ఏ వ్యవస్థ మనలేదు'' అన్నాను.

కోపంలో పెళ్ళి చేసుకోను అంటుందికాని ఎవరికి నష్టం!

ఒక బిందెడు నీళ్ళు మనం జీవించటానికి ఎంతో అవసరం. ఒక బిందెడునీళ్ళవల్ల నదికి తేడా రాదు కానీ, మనిషి చాలా నష్టపోతాడు.

ఈ కాలం ఎన్నో కారణాలవల్ల పెళ్ళిళ్లు ఆలస్యంగా జరుగుతున్నాయి.

కట్నం ఇవ్వగలిగి ఉంటే కొంతవరకూ ఫరవాలేదు. చదువూ, చక్కదనం చాలటం లేదు. ఇంక ఇలాంటి 'స్టిగ్మా' కూడా ఉంటే చెప్పాలా?

చదువుకున్నా చాదస్తాలు పోవటం లేదు. విమర్శాశక్తి పెరిగినా నీతి నిలబడటం లేదు.

ఈ జాతి మేల్కొనేదెప్పుడు?

ఆవేశంలో కథలు రాశాను. నేనే కాదు. ప్రతి పత్రికలో ఎన్నో కథలు యదార్థ పరిస్థితుల్ని చాటి చెప్తూ, నిరశిస్తూ, విమర్శిస్తూ... పరంపరగా వస్తూనే ఉన్నాయి.

కానీ - కానీ - ఏం లాభం - ఎవరికి లాభం ఒరిగింది! పత్రికలు పెరిగాయి. బహుమతి పొందిన కథా రచయితలకి కొద్దిగా లాభించిందేమో!

కథలు చదివి చలించటం మానేశారు జనం! కాలక్షేపానికి చదువుతారు! ఔను, చలించి ఆవేశపడి పరిగెడితే వ్యవస్థ అనే మహాపర్వతాన్ని ఢీ కొన్నట్లయి తల పగలటమే, రక్తం కారటమే అనుభవంలోకి వస్తోంది. చలించకపోవటమే ఒక రక్షణ ఏమో!

ఇంక ఈ రచనలు చదువుకి దూరమైన క్రింద వర్గాల వారిని, పుస్తకాలు చదివే అవసరమేలేని పై తరగతి వారిని చేరటమే లేదు. మనుషులంతా చలిస్తారని, ఏదో మారిపోతారని ఆశించటం శుద్ధ దండగ. ఇదంతా అనుభవపూర్వకంగా తెలుసుకున్న నేను నీతి కథలు రాయటం మానేశాను. ఇంక ఇతర కథలు రాయాల్సిన ఒత్తిడి నా మీద రావటం లేదు.

ఈ సాంఘిక దురన్యాయాలకి అంతం ఎట్లా వస్తుంది? ఎప్పుడు వస్తుంది?

ఏ పార్టీ పాలనలోకి వస్తే రావలసిన మార్పులు వస్తాయి?

అదేమిటో గద్దె ఎవరు ఎక్కినా విక్రమార్కుడి సింహాసనం ఎక్కినవాడిలా అవే చేష్టలు, అవే మాటలు.

''యుగపురుషుడు అవతరించాలా?''

ఏ పురుషుడివలనా అయ్యేట్లుగా కనిపించటం లేదు ఈపని.

ఆపరాని వెల్లువ - ఉప్పెన పొంగి వస్తే - బ్రతికి బయటపడటానికి దొరికిన ఆధారం పట్టుకుని ఈదుతున్నట్లుగా బ్రతుకుతున్నారు జనం.

ఆలోచనలు ఆచరణకి అందటంలేదు. నిరీక్షణలో గడుపుతున్నాను రోజులు.

ఇంక విజయకి పెళ్ళికాదా?

అనుకుంటే మాత్రం చాలా బాధగా ఉండేది.

ఎంత దురదృష్టం! ఎవరిది? విజయదా? విజయలాంటి వాళ్ళని చేసుకోలేకపోయిన వాళ్ళదా?

అందరిదీను.

జీవితానందానికి దూరమైపోతున్నందుకు ఈ విజయ దురదృష్ట వంతురాలు.

యోగ్యురాలైన కన్యని వదులుకుని కట్నాల కాశించి, తల్లిదండ్రుల ఒత్తిడికిలోబడి, చాదస్తాలు కారణంగానూ ఎన్నోరకాల అవకరాలున్న పిల్లల్ని చేసుకుని జీవితాంతం అసంతృప్తితో బాధపడుతున్న వాళ్ళుకూడా దురదృష్టవంతులే!

మోహన్‌తో పరిచయమయ్యాక ఆశ అంకురించింది నాలో.

అతడికి ఇటువంటి పట్టింపు ఉండదు అనుకున్నాను. పట్టించు కోవటానికి తల్లిదండ్రులు లేరు. విజయని చూసి ఇష్టపడితే చాలు. పెళ్ళి అయిపోతుందనుకొన్నాను.

ఇప్పుడు వాడి మొహం చూస్తుంటే ఆలోచనలో పడ్డాడని అనిపిస్తోంది.

''సరే రేపు మాట్లాడుకుందాం. నువ్వు ఆలోచించుకుని చెప్పు.''

అని ఇంటికి వెళ్ళిపోయాను.

మోహన్ ఇంటికివెళ్ళి ఆలోచించుకుంటాడని, ధైర్యం తెచ్చుకుంటాడని.

ఒప్పుకుంటాడనే అనుకున్నాను.

ఆరాత్రంతా నాకు నిద్రపట్టలేదు. ఐనా ఆశకూడా చావలేదు.

మోహన్ అందరిలాంటివాడు కాదు అనుకున్నాను. మర్నాడు వెళ్ళాను.

నేను కూర్చున్నాక

''క్షమించు. నేను ఈ పెళ్ళిచేసుకోలేను'' అన్నాడు.

నేను నోటమాట లేకుండా ఉండిపోయాను.

''ఎంత ఆలోచించినా మనసు ఒప్పటం లేదు. నన్ను పిరికివాడిని అన్నా సరే! నేను పిరికివాడినే అని నేను ఇప్పుడే తెలుసుకున్నాను. నాకు నాలుగుకాలాలపాటు బతకాలని ఉంది!'' అని ధైర్యంగా చెప్పాడు మోహన్.

అతడంత నిశ్చయంగా నిర్భయంగా చెప్తుంటే నేనేం అనలేకపోయాను. ఇంక అతడిని ఒప్పించాల్సిన అవసరం కనిపించలేదు.

''సరే. అది నీ ఇష్టం!'' అని చెప్పి కాసేపు కూర్చొని వచ్చేశాను. జీవితం! మృగతృష్ణ... అక్కడ ఏమీ లేకుండానే ఆకర్షించి లాక్కుంటుంది... భయపెట్టి పారిపోయేటట్లు చేస్తుంది.

మనిషి జరిగినదాన్ని బట్టి ఏవేవో లెక్కలు వేస్తాడు.

లెక్కల ప్రకారం జరిగితే అది జీవితమెందుకవుతుంది! ఊహించని మలుపులు తిరగటం ఆశించినవి అందకుండా పోవటం. వాడినచెట్టు చిగిరించటం ఎన్నెన్నో ఉత్పాతాలని ఎన్నెన్నో అద్భుతాల్ని సృష్టించగల శక్తి జీవితానికి ఉంది.

ఆ అమ్మాయిని పెళ్ళిచేసుకుని అది ఉత్త ఫూలిష్ సెంటిమెంట్ అని ఋజువు చేస్తానని ముందుకు వచ్చే సాహసవంతుడెవరూ కనిపించిలేదు.

''పెళ్ళిచేసుకుంటాను. చస్తానో, బతుకుతానో చూస్తాను' అనే పరిశోధకుడెవడూ తటస్థపడలేదు.

ఏమో ఎందుకేనా మంచిది అని తప్పుకున్నవాళ్ళే అందరూ.

అప్పుడే చావు సమీపించినట్లు ఒణికిపోయేవాడే ప్రతివాడూనూ.

నాకు ఇప్పుడిప్పుడే అర్ధమౌవుతోంది.

మూఢనమ్మకాన్ని వదిలించుకుని హేతుమార్గాన్ని అనుసరించటానికి ఎంత గుండెధైర్యం కావాలో!

నామనసులో విషాదం పేరుకుంటోంది. అతిచతురురాలు శక్తివంతురాలూ ఐన విధి గుప్పిట్లో మనిషి గజగజలాడిపోతాడు. హేతువు సముద్రంలో ఒక గడ్డిపరకలాగ మిగిలిపోతుంది. ములిగిపోతుంది.

ముందర మోహన్ మీద కోపంవచ్చినా అది క్రమంగా కరిగిపోయింది. తరవాత జాలి కూడా వేసింది.

''నాకోసం ఎవరినీ వెతికి తీసుకురానక్కర్లేదు'' అంది విజయ చాలాసార్లు నా ప్రయత్నాలు చూసి, కానీ సుందర్ తెలిశాక ఇది నా ఆఖరి ప్రయత్నం అనుకున్నాను. రెండవపెళ్ళివాడైనా సరే, విజయకి పెళ్ళి అయితే చాలు అనుకున్నాను.

సుందర్‌ని తీసికెళ్లాను పెదనాన్న ఇంటికి. ముందరే చెప్పి ఉంచాను.

ఆదివారం అవటం వలన అందరూ ఇంట్లో ఉన్నారు.

మేము రాగానే విజయ వచ్చి కూర్చుంది.

ఇద్దరినీ ఒకరికొకరికి పరిచయం చేశాను.

పుస్తకాలు, సినిమాలు, రాజకీయాలు... అన్ని విషయాల కబుర్లు సాగాయి. ఒక్కక్షణం నాకు అనిపించింది. అసలు ముఖ్యమైన విషయాలు ఉండగా ఊకదంపుడు కబుర్లు చెప్పుకుంటున్నాం అని.

వినత అందరికీ కాఫీ తెచ్చి ఇచ్చింది.

ముందర తను చూపులకి ఒప్పుకోను, పెళ్ళి వద్దు అంది విజయ. కానీ సుందర్ వచ్చాక వచ్చి కూర్చుని ఫ్రీగా మాట్లాడింది. విజయకి అతడు నచ్చాడనే అనిపించింది నాకు. అసలు గండం ముందరే ఉంది. ఏదీ దాచదలుచుకోలేదు నేను. విజయ కూడా అట్లాగే అంది....

'అందరికీ నన్ను చేసుకోటానికి భయం అని చెప్పెయ్.

ధైర్యం ఉంటేనే చేసుకోమను'' అంది.

వెళ్ళి వస్తామని పెద్దనాన్నకి చెప్పి, సుందర్ ఇంటికి వెళ్ళాము.

దోవలో ఈ విషయాలేమీ మాట్లాడుకోలేదు.

సుందర్ మొహం ఆలోచనలతో గంభీరంగా ఉంది. ఏం మాట్లాడాలో, ఎలా మొదలుపెట్టాలో నాకూ సంకోచంగా ఉంది.

డ్రాయింగ్ రూమ్‌లో సోఫాలో కూర్చున్నాం. వెంటనే ''ఎంత దురదృష్టం కదూ!'' అన్నాడు సుందర్.

ఏమిటి అన్నట్లు కళ్ళెత్తి చూశాను అర్థం గాక.

''ఎంత కష్టపడి పెళ్ళిచేస్తే... సుఖపడాలని ఆశించి పెళ్ళిచేస్తే ఒకరు కాదు, ఇద్దరూ కూతుళ్ళు అట్లాగవటం.... కానీ.... ఈ ప్రపంచంలో ఏం జరిగినా వింతలేదు. ఏదీ సహించలేను అనుకుంటారు కానీ మనిషి ఏం జరిగినా అర్థం చేసుకునే లోపలే భరిస్తాడు. అసలు దేనినైనా కాదు అనేందుకు అక్కడ ఏముంది! కనబడని గోడకి తల కొట్టుకోవటం వంటిదే మనిషి పోరాటం!'' అన్నాడు.

అతడి వేదాంత ధోరణి నాకు ధైర్యాన్ని ఇచ్చింది.

విజయ పెళ్ళి ఎంత సమస్య అయిందో, నిరపరాధి, ఇంకొకరి కారణంగా తన తప్పులేకపోయినా ఎట్లా శిక్షింపబడుతుందో వివరించాను.

సెంటిమెంట్లకి లోబడినంతకాలం మనిషి ఎదగలేడన్నాను.

పూర్తిగా ధైర్యం ఉంటేనే విజయని పెళ్ళి చేసుకోమన్నాను.

''నాకు ధైర్యం ఉంది'' అన్నాడు సుందర్ నవ్వుతూ.

ఆనందంగా ఆశ్చర్యంగా అతడిని చూస్తున్నాను.

''కానీ నేను విజయని చేసుకోవాలనుకోవటం లేదు'' అన్నాడు సుందర్ మళ్ళీ. నా కనుబొమలు ముడిపడ్డాయ్. కోపం వచ్చేస్తోంది. ధైర్యం ఉందట.

'కానీ ఏమిటో మరి!' అన్నాను.

''వినతని చేసుకుంటూ నేను.'' అన్నాడు.

నాకు అర్థం కావటం లేదు. మాటలు వినిపించాయి కానీ, మెదడులోకి ఎక్కటం లేదు. మెల్లిగా ఎక్కుతుంటే మనసున శాంతి కలుగుతుంటే

''అదేమిటి?'' అన్నాను.

''ఇంక మీ విజయ సమస్య పరిష్కారమైనట్లే కదా!'' అన్నాడు నవ్వుతూ.

ప్రభవ సంక్రాంతి సంచిక

1980

* * * *